కార్పొరేషన్ కార్యాలయానికే దిక్కులేదు!

- గోడ పగలగొట్టి గది నిర్మాణం
- ఓ ప్రజాప్రతినిధి అండతో ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న అధికారులు



మున్సిపల్ కాంప్లెక్స్‌లో బడేటి చౌక్ ఎదురుగా ఉన్న బిర్యానీ సెంటర్


వెంటిలేటర్లు కనబడకుండా ఏర్పాటుచేసిన పరదా


మున్సిపల్ కార్యాలయ గోడను పగుల గొట్టి లోపలకు నిర్మించిన గది, వెంటిలేటర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలో కూటమి పార్టీ నాయకుల అండదండలతో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఏకంగా నగర పాలక సంస్థ కార్యాలయం లోపలకు చొచ్చుకొచ్చి మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణం గోడను పగుల గొట్టి రేకులతో గది నిర్మించారు. వెంటిలేటర్లను లోపల వైపు ఏర్పాటుచేశారు. కార్పొరేషన్ లోపల గది బయటకు కనిపించకుండా పరదా కప్పి ఉంచారు. కార్పొరేషన్ ఆవరణలో ఒక పెద్ద చెట్టు ఉండటం, పక్కనే వాహనాల పార్కింగ్ స్థలం ఉండడంతో ఆక్రమణ దారునికి ఎటువంటి అడ్డంకులు లేకుండా పని చేసేసుకున్నారు. ఇది చూసిన కార్పొరేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చి పోయే ప్రజలు అవాక్కవుతున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయానికే దిక్కు లేకుండా పోయిందని, ప్రజల ఆస్తులు, స్థలాలకు రక్షణ ఎక్కడుంటుందని వాపోతున్నారు.

కోఆప్షన్ సభ్యుడి అండదండలు

ఏలూరు కార్పొరేషన్‌కు బయట పక్క బడేటి చౌక్ నుంచి చందనా బ్రదర్స్ ఎదురుగా, కల్పనా థియేటర్ వరకు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటన్నింటిలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. బడేటి చౌక్ ఎదురుగా ఉన్న దుకాణాల్లో బిర్యానీ పాయింట్ ఉంది. దీనికి చోటు సరిపోకపోవడంతో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుని అండదండలతో కాంప్లెక్స్ గోడను పగులగొట్టి కార్పొరేషన్ కార్యాలయం లోపలకు రేకులతో ఒక గది నిర్మించారు. దీన్ని బిర్యానీ పాయింట్ వంట గదిగా మార్చేశారు. కార్పొరేషన్ కార్యాలయం లోపలకు వచ్చే విధంగా వెంటిలేటర్లు ఏర్పాటుచేశారు. నగర పాలక సంస్థ ప్రథమ పౌరురాలి భర్త అయిన సదరు కోఆప్షన్ సభ్యుని అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు సైతం నోరు మెదపడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు నీళ్లు

నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి పోయే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. వారు తమ వాహనాల పార్కింగ్‌కు నానా అగచాట్లు పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వారికి కార్యాలయం లోపల జాగాను అప్పగించేస్తుండటంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళన వ్యక్తమవుతోంది. కార్పొరేషన్ స్థలంలో ఏ విధమైన నిర్మాణాలు చేపట్టాల్సి వచ్చినా కౌన్సిల్‌లో తీర్మానం ప్రవేశ పెట్టి సభ్యులు ఆమోదించాలి. ఇక్కడ నిబంధనలు నీళ్లొదిలి సదరు కో-ఆప్షన్ సభ్యుడు అంతా తానై చక్రంతిప్పేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతి లేదు



కార్పొరేషన్ ఆవరణలోకి చొచ్చుకొని వచ్చి గదిని నిర్మించేందుకు సదరు బిర్యానీ పాయింట్ వారికి అనుమతి ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే గదిని కూల్చేస్తాం. దీనిపై ఫిర్యాదు అందలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎ.భాను ప్రతాప్, కమిషనర్, ఏలూరు కార్పొరేషన్

క్లుప్తంగా

ఉత్సాహంగా రామకోటి మహోత్సవాలు


హరికథా కాలక్షేపం చేస్తున్న భాగవతార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు ఉత్సాహ పూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు, స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన మద్దూరి వెంకట సత్యనారాయణ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి మచిలీపట్నానికి చెందిన మడమల రాంబాబు భాగవతార్ భక్త తులసీ దాసు చరిత్రపై హరికథా కాలక్షేపం చేశారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి


వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వసతి గృహంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక పత్తేబాద్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. వృద్ధులకు అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. వసతి గృహ పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని, వృద్ధుల ఆరోగ్య విషయంలో పరిశుభ్రత ముఖ్యమని అన్నారు. నిరాధారణకు గురైన వృద్ధులకు వారి పిల్లల నుంచి భరణి ఇప్పిస్తామని, పిల్లల పేరున రాసిన ఆస్తులను ఏమైనా ఉన్నా తిరిగి వెనక్కి తీసుకోవచ్చని, ఇటువంటి సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఉచిత న్యాయ సలహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100లో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో వసతి గృహ మేనేజర్ తుమ్మలపల్లి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

దెందులూరు: విద్యా ర్థులు, ఉపాధ్యాయులకు రక్షిత తాగునీరు అందించేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ కలపాల చంద్రశేఖర్ (బుజ్జి) వితరణ రూ.లక్షతో గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. బుజ్జికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు గుండె వైద్య పరీక్షలు


గుండె సంబంధిత పరీక్ష చేస్తున్న వైద్యులు

ఏలూరు టౌన్: కంజెనిటల్ హార్ట్ డిసీజ్ వీక్‌లో భాగంగా ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత పిడియాట్రిక్ కార్డియాలజీ క్యాంపును ఏర్పాటు చేసినట్టు ఏలూరు జీజీహెచ్ సూపరింటిండెంట్, ప్రొఫెసర్ ఎంఎస్ రాజు తెలిపారు. బుధవారం హాస్పిటల్‌లోని పిడియాట్రిక్ విభాగంలో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల గుండెలకు భరోసా కల్పిస్తూ పసి హృదయాలకు రక్షణగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ రాజు అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 30 మందికి పైగా చిన్నారులకు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. చికిత్సలను సూచించారు. పిడియాట్రిక్ వైద్య నిపుణులు దీపక్ కుమార్, పి.బ్రహ్మయ్య, డీఈఐసీ మేనేజర్ బొప్పన నరేష్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ పిడియాట్రిక్ కార్డియాలజీ వైద్య నిపుణులు వి.వాసుదేవ్, కె.అనూష ఉన్నారు.

గాయపడిన గంటలోపే చికిత్స అందించాలి


మొక్క నాటుతున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు మొదటి గంటలో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడగలమని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనరు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. క్షతగాత్రులకు మొదటి గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని తెలిపారు. ఆ సమయంలో చికిత్స అందిస్తే ప్రాణాలు రక్షించవచ్చని, క్షతగాత్రుల్ని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలను రక్షించిన వారికి రివార్డులు అందిస్తారని తెలిపారు. కొత్త చట్టాల ప్రకారం రహదారి ప్రమాదాలకు గురైన వారికి ఆసుపత్రుల్లో కొన్ని రూ.లక్షలపైనే వైద్యం ఉచితంగా అందించే వెసులుబాటు ఉందని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. మైనర్లకు మోటారు వాహనాలు ఇచ్చిన తల్లితండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శిబిరంలో జంగారెడ్డిగూడెం ఆర్టీఓ ఎండీ మదానీ, ఏలూరు కార్యాలయ సిబ్బంది, తదితరులు 20 మందికి పైగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ పీఆర్వో శ్రీనివాస్, వైద్యాధికారి, ఆరుగురు సభ్యుల వైద్య బృందం సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు ఎం రాము, ఎం ఆనంద్ కుమార్, వాహన తనిఖీ అధికారులు ఎస్‌డీ విఠల్, ఎండీ జమీర్, అజ్మీరా బద్దు, కళ్యాణి, నరేంద్ర బాబు, ప్రజ్ఞ పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన


ఫ్లాష్‌మాబ్‌లో డెంటల్ విద్యార్థుల నృత్యం

నోటి క్యాన్సర్‌కు గురికావద్దంటూ దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల విద్యార్థులు బుధవారం ఏలూరు విజయవిహార్ సెంటర్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. నృత్య ప్రదర్శన, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. దంతాల ద్వారా వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించి వైద్యం చేయించుకుంటే నివారించవచ్చని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ రెవ. ఫాదర్ మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ స్లీవరాజులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు


నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు


నో స్మోకింగ్ ప్ల కార్డులతో విద్యార్థులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఒన్‌టౌన్ ప్రాంతం వెన్నవల్లివారి పేట ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 14న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ పేర్కొన్నారు. అగ్రహారం, కెనాల్ రోడ్డు, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, బాలాజీ థియేటర్ ప్రాంతం, జంట కల్యాణ మండపాలు, రామకోటి ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని వివరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం ఆయన్ని తన కార్యాలయంలో గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బోయపాటి గణేష్ ఆధ్వర్యంలో గాలాయగూడెం, నాగులదేవునిపాడు, అక్కిరెడ్డిగూడెంకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు కలిశారు. కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. పెన్షన్ల సర్వేలు చేస్తూ లబ్ధిదారులను పరోక్షంగా గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులకు తానతోపాటు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని అబ్బయ్య చౌదరి భరోసా కల్పించారు. పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, నాయకులు మల్లిక్, ఏడుకొండలు, రమేష్, సురేష్, శ్రీను, సందీప్, సాయి, వార్డు మెంబర్లు వన్నెకూటి రాజేష్, కొండపల్లి శ్రీధర్ ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల


క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల చేసిన డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్ : యువత తమ స్నేహితులను గుర్తు చేసుకుంటూ స్నేహాంజలి పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో బుధవారం స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-12 పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తమ శక్తి, ప్రతిభను చాటుకుంటూ ఉపాధి, ఉద్యోగాల్లో స్థిరపడేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, స్ఫూర్తి కలుగుతాయని తెలిపారు. గత 12 ఏళ్లుగా మరణించిన తమ మిత్రుల జ్ఞాపకార్థం స్నేహాంజలి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం సంతోషంగా ఉందని ఎన్‌జీఓ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సార్జెంట్ అమలేశ్వరరావు, ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ సతీష్ సావిత్రి సారెల్లా, స్నేహాంజలి ఫ్రెండ్స్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఈటీలకు సత్కారం


పీఈటీలను సత్కరించిన డీఈఓ వెంకటలక్ష్మమ్మ

దెందులూరు: రాష్ట్ర స్థాయిలో హైజంప్, ట్రిపుల్ జంప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు, 800 మీటర్లు పరుగు హైజంప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన కలపర్రు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.విజయలక్ష్మిలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారిని వెంకటలక్ష్మమ్మ సత్కరించారు. ప్రశంస పత్రం అందజేశారు. ఈ నెల ఫిబ్రవరి 8, 9 తేదీల్లో అనంతపురం పీటీసీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణారావు, జయలక్ష్మి పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు.

అప్పనవీడు విద్యార్థుల ప్రతిభ

పెదపాడు : కోనసీమ జిల్లాలోని మదర్ థెరిస్సా అకాడమీ నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అప్పనవీడు హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు, డాన్స్‌లో ఆరుగురు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా చిత్రలేఖన ఉపాధ్యాయులు ఎస్ రజనీ కాంత్ మాట్లాడుతూ చిత్రలేఖనంలో రాణించడం వల్ల భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమానంతో భార్యపై దాడి

భీమడోలు: అనుమానంతో భార్య, అడ్డొచ్చిన అత్తామామలపై అల్లుడు దాడి చేసిన ఘటన పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో జరిగింది. గాయాలైన బాధితులు ముగ్గుర్నీ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భీమడోలు పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమో దు చేశారు. ఎంఎంపురానికి చెందిన బొద్దు ఆలోసిస్ తన కుమార్తెను అదే గ్రామానికి చెందిన పూనూరి సత్యానందంకు ఇచ్చి వివాహం చేశారు. గల్ఫ్ దేశాలు వెళ్లి తిరిగొచ్చిన సత్యానందం స్వగ్రామంలోనే ఉంటున్నాడు. అయితే భార్యపై అనుమానంతో ఈనెల 9న అర్ధ రాత్రి ప్లాస్టిక్ వైర్‌తో తీవ్రంగా గాయపర్చాడు. అడ్డెళ్లిన అత్తామామలపైనా దాడి చేశాడు. బాధితులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు చెక్కు అందిస్తున్న దాతలు

దెందులూరు: అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం మహోన్నతమైందని, పట్టుదల, క్రమశిక్షణ నిరంతర సాధనతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ఎన్ఆర్ఐ శ్రీధర్ అన్నారు. బుధవారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో ఫస్ట్, సెకండ్ 100కు 98 మార్కులు సాధించిన రామిశెట్టి నాగమణిక్యం రూ.2000, మరిది పార్థుకు రూ.1500, ఇంగ్లీష్‌లో 100కు 98 మార్కుల సాధించిన షేక్ తనీషాకు రూ.1500 చెక్కులను ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్టు అధినేత ఎన్ఆర్ఐ శ్రీధర్ అందజేశారు. పాఠశాలలో స్టేజి నిర్మాణానికి రూ.లక్ష అందిస్తానని శ్రీధర్ హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉపాధ్యాయుల కు ఆయన సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ముందుకొచ్చిన దాతను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు ఎస్ వెంకట్రాది, నారాయణరావు పల్లారెడ్డి, ఆశీర్వాదం గుల్లపూడి వెంకటేశ్వరరావు, సుధీర్ గణేష్, ప్రభు పాల్, కళ్యాణి, లావణ్య ఉన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

పెదపాడు : రైతులు ఎలుకల నివారణకు సామూహికంగా నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పనవీడు, కొత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందించారు. కార్యక్రమంలో పావులూరి రామారావు, వడ్డి వాసవి, బెక్కం శ్రీనివాసరావు, కాశీ విశ్వనాథం, పల్లపోతు శ్రీనివాసరావు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

గణపవరం: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చునని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం డిగ్రీ కాలేజీలో సైన్సు గ్రూపు విద్యార్థులకు కెమిస్ట్రీ సబ్జక్టుపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. అతిథి ఉపన్యాసకునిగా డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీకాలేజీ, తాడేపల్లిగూడెం రసాయనశాస్త్ర విభాగాధిపతి లెఫ్టినెంట్ ఎంవీ ప్రేమసాగర్ రసాయన శాస్త్ర ప్రాముఖ్యత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రేమసాగర్‌ను మెమెంటోతో సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ చైతన్య పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	44-48
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	10, 15
బెండకాయలు	36	కంద	72
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	34
కాకర కాయలు	36-44	కీరా దోస	40-46
బీరకాయలు	00	ఫ్రెంచ్‌బీన్స్	72
కాలీఫ్లవర్	00	అల్లం	50
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07-10
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	24-34	బఠాణీ	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర) నాన్ ఏసీ	16.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32